క్లుప్తంగా

ఘనంగా శ్రీలక్ష్మీ నరసింహుని కల్యాణం



కోరుమిల్లిలో అలంకరణలో శ్రీలక్ష్మీ నరసింహస్వామి

కపిలేశ్వరపురం: మండలంలోని శ్రీలక్ష్మీ నరసింహ స్వామి కల్యాణం ఆదివారం రాత్రి వైభవంగా నిర్వహించారు. అర్చకులు పెదపూడి సీతా రామ్, ఖండవల్లి పెరుమాళ్లాచార్యులు అర్చక పర్యవేక్షణలో వైఖానస భగవత్ శాస్త్రానుసారం స్వామివారి కల్యాణం చేశారు. గ్రామానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణానికి సహకరించాలి



రాయవరంలో బాణసంచా యజమానికి నోటీసు ఇస్తున్న సీఐ శ్రీధర్‌కుమార్

రాయవరం: సార్వత్రిక ఎన్నికల అనంతరం కూడా గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా, శాంతియుత వాతావరణం నెలకొనేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని మండపేట రూరల్ సీఐ కె.శ్రీధర్‌కుమార్ కోరారు. మండలంలోని పలు గ్రామాల్లో సోమవారం ఆయన రాయవరం ఎస్సై జి.నరేష్‌తో కలిసి గ్రామసభలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీధర్‌కుమార్ మాట్లాడుతూ ఎన్నికల ఫలితాలు వచ్చే వరకు, ఎన్నికల ఫలితాలు వచ్చిన తర్వాత కూడా ఎలాంటి అల్లర్లు, ఘర్షణలకు పాల్పడకుండా ప్రతి ఒక్కరూ స్నేహపూర్వకంగా, శాంతియుతంగా ఉండాలన్నారు. ఎన్నికల తుది ఫలితాలు వచ్చే వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళికి అనుగుణంగా ప్రతి ఒక్కరూ నడుచుకోవాలన్నారు. అలాగే బాణసంచా విక్రయాలు చేపట్టరాదంటూ దుకాణ యజమానులకు నోటీసులు అందజేశారు. పెట్రోల్ బంకుల్లో వాహనాల్లో మాత్రమే ఇంధనం పోయాలని, సీసాలు, పీపాల్లో పెట్రోల్ వేయరాదని బంక్ యజమానులకు నోటీసులు జారీ చేశారు. ఎన్నికల నిబంధనలను ఏ ఒక్కరు అతిక్రమించినా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వైభవంగా స్వామివార్ల కల్యాణ మహోత్సవం



ఈదరాడలో స్వామి వారి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

మామిడికుదురు: ఈదరాడ, అప్పనపల్లి, గోగన్నమఠం గ్రామాల్లో కొలువుదీరిన ఈశ్వరుడి కల్యాణం ఆదివారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. భక్తుల కోలాహలం, వేద మంత్రాలు, మంగళ వాయిద్యాలు, బాణసంచా కాల్పుల నడుమ కల్యాణ మహోత్సవాన్ని కన్నుల పండువలా జరిపించారు. ఈదరాడలో కొలువుదీరిన ఉమాసోమేశ్వరస్వామి, లక్ష్మీ నర్సింహస్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని రమణీయంగా జరిపించారు. గోగన్నమఠంలో కొలువైన పార్వతీ సోమేశ్వరస్వామి, అప్పనపల్లిలో కొలువుదీరిన కాశీ అన్నపూర్ణ విశ్వేశ్వర స్వామి వారి కల్యాణం అంగరంగ వైభవంగా జరిపించారు. భారీ సంఖ్యలో భక్తులు స్వామి వార్ల కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు.

సేంద్రియ సాగు.. ఎంతో బాగు

- ఈ ఎరువులతో బహుళ ప్రయోజనాలు
- తక్కువ పెట్టుబడి.. అధిక దిగుబడి
- ఖరీఫ్‌కు సన్నద్ధం అవుతున్న అన్నదాతలు



సేంద్రియ ఎరువును ట్రాక్టర్‌పై పొలానికి తరలిస్తున్న రైతులు

రాయవరం: ఇప్పుడు అందరి చూపు సేంద్రియ ఎరువులపైనే ఉంది. రసాయన ఎరువుల కన్నా, సేంద్రియ ఎరువుల వల్ల బహుళ ప్రయోజనాలున్నాయని వ్యవసాయ శాఖ తరచూ రైతులకు చెబుతున్న మాట. రసాయన ఎరువులు అధిక వాడకం వల్ల సూక్ష్మ పోషక లోపాలు అధికమవుతాయి. పంటలకు ఏ ఒక్క సూక్ష్మ పోషక లోపమున్నా దిగుబడి తగ్గిపోతుంది. అదే సేంద్రియ ఎరువులు వినియోగిస్తే భూసారంతో పాటు, దిగుబడులు గణనీయంగా పెరుగుతాయి. మరో వారం రోజుల్లో రైతులు ఖరీఫ్ పనులకు సన్నద్ధమవుతున్నారు. తొలుత రైతులు నారుమళ్లు వేసేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

పశువుల ఎరువు

చాలా మంది రైతులు పశువుల ఎరువును గోతిలో వేసి మాగేస్తారు. ఇటువంటి ఎరువును ఖరీఫ్‌కు ముందు పొలాల్లో చల్లుకోవాలి. పశువుల ఎరువులో 0.5 నుంచి 1.5 శాతం నత్రజని, 0.3 నుంచి 0.9 శాతం భాస్వరం, 0.5 నుంచి 1.9 శాతం పొటాషియం ఉంటాయి. ఈ పోషకాలు నష్టపోకుండా ఉండాలంటే పశువుల ఎరువును సరైన పద్ధతిలో వినియోగించాలి. ముందుగా 20/5/3 (పొడవు, వెడల్పు, లోతు) అడుగుల గొయ్యిని తయారు చేయాలి. గొయ్యిలో పశువులు తొక్కిన గడ్డిని, మూత్రం వేసిన గడ్డిని పొరలు, పొరలుగా వేసి, అందులో పశువుల ఎరువును గొయ్యి పైకి అర మీటరు ఎత్తు వచ్చే వరకు వేసి, మట్టితో కానీ, పేడతో కానీ అలకాలి. ప్రతి టన్ను పశువుల పేడకు కిలో సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ చొప్పున గోతిలోని పొరల మధ్య చల్లితే, బాగా కుళ్లి మంచి పశువుల ఎరువు తయారవుతుంది. దీనిని పొలానికి తోలి కుప్పలుగా వేయాలి. పశువుల పెంటను చేలో చల్లడానికి మూడు, నాలుగు వారాల ముందు నిలువుగా, అడ్డంగా భూమిని దున్ని, సేంద్రియ ఎరువును చల్లాలి. పశువుల ఎరువులో సేంద్రియ పదార్థం 32 శాతం మాత్రమే ఉంటుంది. కాబట్టి పొలాలకు ఎక్కువ పరిమాణంలో వాడాలి.

కంపోస్టు ఎరువు

రెండు లేదా మూడు పశువులు కలిగి ఉన్న రైతు దీనిని సులభంగా తయారు చేయవచ్చు. ఆరు మీటర్ల పొడవు, ఒక మీటరు వెడల్పు, ఒక మీటరు లోతున రెండు గోతులు తవ్వాలి. గోతిని వెదురు కర్రలతో ఆరు పొరలుగా విభజించాలి. పశువుల కొట్టాం, పొలంలోని వ్యర్థాలతో పాటు, అంతే పరిమాణం కలిగిన మట్టిని గోతుల్లో వేయాలి. ఐదు నుంచి ఆరు రోజుల పాటు గుంతపై భాగం ఒక టిన్నర అడుగుల వరకు వచ్చేలా మట్టితో అలకాలి. రెండో గోతిని కూడా వ్యర్థాలతో నింపి, రెండు నెలల పాటు మగ్గనిచ్చి ఎరువుగా వాడుకోవచ్చు.

భూమి సారవంతం



సాధ్యమైనంత వరకు రైతులు సేంద్రియ ఎరువులనే వినియోగించాలి. తద్వారా భూమి సారవంతమవుతుంది. నేల చౌడు బారకుండా ఉంటుంది. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించవచ్చు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే రైతులు పొలాల్లో సేంద్రియ ఎరువులు చల్లుకోవడం చాలా మంచిది.

– కొప్పిశెట్టి ప్రభాకర్, మండల వ్యవసాయాధికారి, రాయవరం

చెరకు ఎండుటాకు కంపోస్టు

అలాగే చెరకు పంట నుంచి ఎకరానికి మూడు టన్నుల చెరకు చెత్త వ్యర్థంగా లభిస్తుంది. దీన్ని పొలంలో కాల్చకుండా, కంపోస్టు తయారు చేసుకుని పొలానికి వాడితే లాభం ఉంటుంది. ముందుగా 6/2/1 మీటర్ల గొయ్యిని తీసి, సుమారు 15 సెం.మీ మందం వరుసల్లో చెరకు చెత్తను పరిచి, ప్రతి వరుసపై కంపోస్టు కల్చరు కానీ, యూరియా, సింగిల్ సూపర్ ఫాస్ఫేట్‌తో పాటు పేడ నీరు చల్లాలి. నేల మట్టానికి కొంచెం పై వరకు వచ్చేలా గొయ్యిలో చెరకు చెత్త వరుసలు వేయాలి. ఆ గొయ్యిని మట్టితో కప్పి, ఆరేడు నెలల తర్వాత చూస్తే నాణ్యమైన ఎరువు తయారవుతుంది. గొయ్యి ఎప్పుడూ తడిగా ఉండేలా చూసుకోవాలి. ఈ కంపోస్టును ఎకరానికి ఒక టన్ను చొప్పున సేంద్రియ ఎరువుగా వాడవచ్చు. ఈ కంపోస్టులో సేంద్రియ పదార్థం 38 శాతం, నత్రజని 0.70 శాతం ఉంటాయి. ఇలా భూమిలో కుళ్లే ఎటువంటి ఆకులనైనా పేడతో కుళ్లబెట్టి సేంద్రియ ఎరువులను తయారు చేయవచ్చు.

రైతు సమస్యలపై చిత్తశుద్ధి లేదు



శీలలో ధాన్యం విక్రయాలు పరిశీలిస్తూ రైతులతో మాట్లాడుతున్న కౌలు రైతులు

కాజులూరు: రైతు సమస్యలపై కేంద్ర ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని ఏపీ కౌలు రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వల్లు రాజబాబు అన్నారు. సోమవారం మండలంలోని చేదువాడ, శీల, కాజులూరు తదితర గ్రామాల్లో కౌలు రైతు సంఘం నాయకులు పర్యటించి ధాన్యం కొనుగోళ్లపై పరిశీలన చేపట్టారు. రాజబాబు తదితరులు మాట్లాడుతూ రెండేళ్ల క్రితం దేశ రాజధాని ఢిల్లీలో రైతులు చేసిన ఉద్యమ ఫలితంగా బీజేపీ ప్రభుత్వం ఇచ్చిన హామీలు ఏ మాత్రం అమలు జరగకపోవటంతో దేశ వ్యాప్తంగా రైతాంగం తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. 2014లో ప్రభుత్వం వేసిన మూడు కమీషన్లు క్వింటా ధాన్యానికి రూ.3300 మద్దతు ధర ఇవ్వాలని సూచించాయని అయితే బీజేపీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి పంటకు మద్దతు ధర కల్పించి రైతులను ఆదుకోవాలన్నారు.

ప్రజాదరణతో మళ్లీ విజయం సాధిస్తున్నాం



ఎస్సీ సామాజికవర్గ కార్యకర్తలతో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్

కాజులూరు: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు రాష్ట్ర వ్యాప్తంగా ఎంతో ప్రజాదరణ లభించిందని ప్రభుత్వంపై ప్రజలకు కలిగిన విశ్వాసం, పార్టీపై వారికి గల అభిమానంతో నియోజకవర్గంలోనూ, రాష్ట్రంలోనూ ఘనవిజయం సాధిస్తున్నామని రామచంద్రపురం వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్ ధీమా వ్యక్తం చేశారు. సోమవారం మండల గ్రామాలకు చెందిన మాదిగ సామాజిక వర్గ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే అభ్యర్థి పిల్లి సూర్యప్రకాశ్‌ను మర్యాదపూర్వకంగా కలుసుకుని ముందస్తు శుభాకాంక్షలు తెలిపారు. ఆయన మాట్లాడుతూ ఈ ఎన్నికలు పేదలకు, పెత్తందార్లకు మధ్య జరిగిన యుద్ధంగా అభివర్ణించారు. గత ఐదేళ్లలో జగనన్న అమలు చేసిన సంక్షేమ పథకాలపై ప్రజలు పూర్తిగా విశ్వాసం చాటుకున్నారన్నారు. పెత్తందార్లు ఎంతమంది కలసి ప్రజలను ఏమార్చాలని చూసినా పథకాలు పొందిన పేద, మధ్యతరగతి వర్గాలు మాత్రం వైఎస్సార్‌సీపీ పక్షానే నిలిచారన్నారు. నియోజకవర్గంలో మంచి మెజార్టీతో విజయం సాధించడంతో పాటు పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా సీఎం జగనన్న చెప్పినట్టు గత ఎన్నికల ఫలితాలను మించి స్థానాల్లో గెలుపు సాధిస్తుందన్నారు. నియోజకవర్గంలో ఎన్నికల్లో పార్టీ విజయం కోసం నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అవిశ్రాంతగా కృషి చేశారని వారందరికీ ఎంతో రుణపడి ఉంటానన్నారు. కార్యక్రమంలో గొల్లపాలెం ఎంపీటీసీ సభ్యులు జొన్నకూటి పద్మ, కొల్లు వీరబాబు, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉట్రుమిల్లిలో కార్డన్ అండ్ సెర్చ్



ఉట్రుమిల్లి రాజీవ్ గృహకల్ప అపార్టుమెంటు వాసులతో మాట్లాడుతున్న డీఎస్పీ రామకృష్ణ

రామచంద్రపురం రూరల్: కోనసీమ జిల్లా ఎస్పీ ఎస్. శ్రీధర్ ఆదేశాల మేరకు రామచంద్రపురం డీఎస్పీ బి.రామకృష్ణ నేతృత్వంలో మండలంలోని ఉట్రుమిల్లి రాజీవ్ గృహకల్ప అపార్టుమెంట్ల వద్ద పోలీస్ శాఖ కార్డెన్ అండ్ సెర్చ్ కార్యక్రమం నిర్వహించారు. బయటి వ్యక్తుల ద్వారా ఈ ప్రాంతంలో అసాంఘిక కార్యక్రమాలు జరుగుతున్నాయన్నా సమాచారంతో రామచంద్రపురం సీఐ పి.దొరరాజు, ద్రాక్షారామ ఎస్సై జి.సురేంద్ర, రామచంద్రపురం ఎస్సై కె.సురేష్‌బాబు, పామర్రు ఎస్సై జానీ బాషా, సర్కిల్ పోలీస్ సిబ్బంది అపార్టుమెంట్లలో విస్తృతంగా తనిఖీలు చేశారు. సరైన రిజిస్ట్రేషన్ పత్రాలు లేని 27 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. యజమానులు సరైన పత్రాలను తీసుకువచ్చి తమ వాహనాలను తీసుకుని వెళ్లవచ్చని, పత్రాలు లేకపోతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం అపార్టుమెంటు వాసులను సమావేశ పరిచి కొత్తగా ఎవరైనా అనుమానాస్పదంగా బయటి నుంచి ఎవరు వచ్చినా, అపార్టుమెంటులో ఉంటున్నా తమ దృష్టికి తీసుకుని రావాలని సూచించారు. ప్రస్తుతం జనరల్ ఎలక్షన్ కోడ్ అమలులో ఉన్నందున అందరూ అప్రమత్తంగా ఉండాలని కౌంటింగ్ పూర్తయ్యేవరకు శాంతి భద్రతలు కాపాడడానికి తమకు పూర్తిగా సహకరించాలని కోరారు.

27న అమ్మవార్ల జాతర

మామిడికుదురు: బి.దొడ్డవరం గ్రామ దేవతలు ముత్యాలమ్మ, గోగులమ్మ వార్ల జాతర మహోత్సవం ఈ నెల 27వ తేదీ సోమవారం జరుగుతుందని ఆలయ కమిటీ సోమవారం తెలిపింది. మూడు రోజుల పాటు జరిగే జాతరలో భాగంగా 28వ తేదీ మంగళవారం అమ్మవార్లకు నైవేద్యాలు చెల్లిస్తారని, 29వ తేదీ బుధవారం అమ్మవార్ల తీర్థ మహోత్సవం జరుగుతుందని ఆలయ కమిటీ తెలిపింది. జాతర మహోత్సవాల సందర్భంగా పందిళ్లు, పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

విజ్ఞానం.. వికాసం..

- సత్ఫలితాలనిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలు
- జూన్ 7 వరకూ నిర్వహణ
- జిల్లా గ్రంథాలయ సంస్థ పర్యవేక్షణ
- రెండు నియోజకవర్గాల్లో 11 గ్రంథాలయాలు



కపిలేశ్వరపురం గ్రంథాలయంలో పుస్తకాలను పరిశీలిస్తున్న విద్యార్థులు



కపిలేశ్వరపురం గ్రంథాలయంలో కథను చెబుతున్న రిటైర్డ్ టీచర్ సీహెచ్ సత్యనారాయణ

కపిలేశ్వరపురం: బడి పిల్లలు ఏప్రిల్ 24 నుంచి ఇంటి పట్టున ఉంటున్నారు. వేసవి సెలవుల్లో విద్యార్థులు తమ సమయాన్ని విజ్ఞానం, వికాసం వైపు మళ్లించాలన్న లక్ష్యంతో ప్రభుత్వం గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలను నిర్వహిస్తోంది. ఇవి ఈ నెల 15న ప్రారంభం కాగా, జూన్ 7 వరకూ శిబిరాలు కొనసాగనున్నాయి. ఈ నేపథ్యంలో కథనం.

రెండు నియోజకవర్గాల్లో గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలోని మొత్తం 11 గ్రంథాలయాలున్నాయి. వీటిలో గ్రేడ్-1 రెండు, గ్రేడ్-3 తొమ్మిది ఉన్నాయి.

విజ్ఞాన శిబిరాల నిర్వహణ ఇలా..

గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు ఈ నెల 15 నుంచి జూన్ ఏడున పాఠశాలలు తెరిచే వరకూ 23 రోజులు పాటు కొనసాగుతాయి. రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ ఆదేశాలపై నిర్వహించే శిబిరాలను ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా గ్రంథాలయ సంస్థ అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకూ శిబిరం నిర్వహిస్తున్నారు. 6, 10 తరగతుల విద్యార్థులపై దృష్టి సారిస్తున్నారు. పఠనం, సరదా అనే రెండు కీలకాంశాలతో నిర్వహించే శిబిరంలో పుస్తకాలను చదివించడం, కథలు చెప్పించడం, ప్రముఖులతో అవగాహన సదస్సులు నిర్వహించడం, చెస్, క్యారమ్స్ తదితర ఆటలపై అవగాహన కల్పించడం చేస్తున్నారు. జీవితంలో విజయం సాధించి, స్ఫూర్తిదాయకంగా నిలిచిన ప్రముఖులు, స్వాతంత్ర్య సమర యోధులు, సామాజిక రంగంలో రాణించిన వారి జీవిత చరిత్ర పుస్తకాలను అందుబాటులో ఉంచారు. ఆంగ్ల భాషనూ నేర్పుతారు. కథలు వినడం, పుస్తకాన్ని చదవడం, కథలు చెప్పడం, ఇంగ్లిష్ భాష, డ్రాయింగ్, పెయింటింగ్ నేర్చుకోవడం, డ్యాన్స్, చెస్ ఇతర గేమ్స్‌లో తర్ఫీదు పొందడమూ చేస్తున్నారు.

మండలం	స్థాయి	గ్రంథాలయాలు
మండపేట అర్బన్	గ్రేడ్-3	01
రాయవరం	గ్రేడ్-3	02
కపిలేశ్వరపురం	గ్రేడ్-3	02
రామచంద్రపురం	గ్రేడ్-1	01
రామచంద్రపురం రూరల్	గ్రేడ్-3	02
కె.గంగవరం	గ్రేడ్-3	02
కాజులూరు	గ్రేడ్-1	01

ఎన్టీఆర్ సేవా సమితి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం



ద్రాక్షారామలో రక్తదానం చేస్తున్న జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు



ద్రాక్షారామలో బాధిత కుటుంబాలకు చెక్కులు అందజేస్తున్న జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు

రామచంద్రపురం రూరల్: జూనియర్ ఎన్టీఆర్ పుట్టిన రోజు పురస్కరించుకుని సోమవారం ఎన్టీఆర్ సేవా సమితి ఆధ్వర్యంలో కాకినాడ రోటరీ బ్లడ్ బ్యాంక్ పర్యవేక్షణలో ద్రాక్షారామలో రక్తదాన శిబిరం నిర్వహించారు. జూనియర్ ఎన్టీఆర్ అభిమానులు 22 మంది రక్తదానం చేశారు. అనంతరం కేక్ కట్ చేసి పంచుకున్నారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ సేవాసమితి గౌరవాధ్యక్షుడు, రాష్ట్ర ఇండస్ట్రియల్ కార్పొరేషన్ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్, అధ్యక్షుడు సాదే రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

అభిమానుల కుటుంబాలకు ఆర్థిక సాయం

నియోజకవర్గంలో ఇటీవల మృతి చెందిన జూనియర్ ఎన్టీఆర్ అభిమానుల కుటుంబాలకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా తారక్ సంక్షేమ సేవా సంఘం నుంచి సోమవారం ఆర్థిక సాయం అందజేశారు. రామచంద్రపురం నియోజకవర్గ ఎన్టీఆర్ సేవా సమితి ఆధ్వర్యంలో రూ.40 వేల చెక్కును రామచంద్రపురానికి చెందిన రాపాక శివప్రసాద్, కె.గంగవరానికి చెందిన ఖండవిల్లి ప్రదీప్ కుమార్‌ల కుటుంబాలకు సేవా సమితి గౌరవాధ్యక్షుడు, రాష్ట్ర ఇండస్ట్రియల్ కార్పొరేషన్ డైరెక్టర్ వాసంశెట్టి శ్యామ్, అధ్యక్షుడు సాదే రాజేష్ తదితరుల చేతుల మీదుగా అందజేశారు.

జూ.ఎన్టీఆర్ పుట్టిన రోజు వేడుకలు

కపిలేశ్వరపురం: సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్ 41వ పుట్టిన రోజు వేడుకలను అంగరలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలు చేశారు. గ్రామ సమీపాన ఉన్న సందిపూడి గ్రామ ఆయకట్టులోని చెరువు పూడికతీత పనులు చేస్తున్న ఉపాధి కూలీలకు శీతల పానీయాలు, బిస్కట్లు అందజేశారు. అభిమాన సంఘ నాయకులు సూరంపూడి మారుతి, గుత్తుల స్వామి, నవీన్, భానుప్రసాద్, సతీష్, కృష్ణ, కుమార్ స్వామి పాల్గొన్నారు.

ఉచిత విద్యకు 64 మంది ఎంపిక

ఆలమూరు: అర్హులైన పేద విద్యార్థు ల కార్పొరేట్ విద్యలో భాగంగా మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాల ల నుంచి 64 మంది ఎంపికయ్యారు. వీరిలో ప్రస్తుతం 40 మంది కార్పొస్కూళ్లలో చేరినట్లు ఎంఈఓ తెలిపారు. మిగిలిన వారిని కూడా చేర్పించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.

పొలాల్లోకి సెప్టిక్ ట్యాంక్ నీళ్లు

స్థానికులు, రైతుల ఆందోళన



మొగలిపాలెం రోడ్‌లో సెప్టిక్ క్లీనింగ్ ట్యాంకర్ నీటిని కూరాడ కాలువలోకి వదులుతున్న నిర్వాహకులు

కాజులూరు: మండలంలోని గొల్లపాలెంలో తరచూ పంటపొలాలు, కాలువల్లోకి సెప్టిక్ ట్యాంక్ నీళ్లు వదలుతుండటంతో స్థానికులు, రైతుల ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని గొల్లపాలెం, ఆర్యావటంలలో సుమారు 10 సెప్టిక్ క్లీనింగ్ ట్యాంకర్లు ఉన్నాయి. వీరు ప్రతిరోజు కరప, కాజులూరు మండల గ్రామాల్లో సెప్టిక్ ట్యాంక్‌లు క్లీనింగ్ చేసి వ్యర్థాలను మొగలిపాలెం రోడ్‌లోని వంతెన వద్ద పంటపొలాలు, కూరాడ కాలువల్లోకి వదులుతున్నారు. సెప్టిక్ ట్యాంక్ క్లీనింగ్ చేసిన వ్యర్థాలను కాలువల్లోనికి వదులుతుండటంతో కాలువ మురికి కూపంగా మారిపోతుందని పూడిక తొలగింపునకు కూలీలెవరూ పనుల్లోకి రావడం లేదని రైతులు వాపోతున్నారు. నీటి ఎద్దడి సమయాల్లో కూరాడ కాలువ నుంచే ఆయిల్ ఇంజిన్ల ద్వారా పొలాలకు సాగునీరు తోడుకుంటున్నామని సెప్టిక్ ట్యాంకర్లు వదులుతుండటంతో కాలువ నీరు కనీసం పశువులు తాగేందుకు కూడా పనికి రావడం లేదని రైతులు చెబుతున్నారు. సెప్టిక్ క్లీనింగ్ ట్యాంకర్లతో వ్యర్థాలను కాలువల్లోకి వదులుతుండగా పలువురు రైతులు, స్థానికులు అడ్డుకోగా ట్యాంకర్ నిర్వాహకులకు, రైతులకు మధ్య వివాదాలు తలెత్తిన సంఘటనలు ఉన్నాయి. ఈ విషయంపై పలుమార్లు స్థానికులు పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు మందలించి పంపారు. అయినప్పటికీ పరిస్థితి మారటంలేదని ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి తగిన చర్యలు తీసుకోవాలని బాధిత రైతులు, స్థానికులు కోరుతున్నారు.

కాలువనీరు దుర్గంధంగా మారిపోతోంది



సెప్టిక్ ట్యాంక్ నీళ్లు వదలుతుండటంతో కాలువనీరు దుర్గంధ భరితంగా మారిపోతోంది. భరించలేని దుర్వాసనలతో గట్లపై నుంచి వెళ్లలేకపోతున్నాం. పశువులు సైతం కాలువ నీరు తాగేందుకు ఇబ్బందులు పడుతున్నాయి.

– చిర్ల వెంకటరెడ్డి, రైతు, మొగలిపాలెం

నీరు తోడుకునేందుకు వీలులేదు



సాగునీటి ఎద్దడి సమయాల్లో రైతులు డ్రెయిన్లలోని నీటిని పంటపొలాలకు తోడుకునేవారం. సెప్టిక్ ట్యాంక్ నీళ్లు వదలుతుండటంతో కాలువనీరు మురికిగా మారిపోయి పొలాలకు నీరు తోడుకునేందుకు వీలు లేకుండా ఉంది.

– ద్వారంపూడి సోమిరెడ్డి, స్థానికుడు, బందనపూడి